www.prajajwalanews.com

# ప్రజాజ్వాల

తెలుగు దినపత్రిక

ప్రజాజ్వాల
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును
చీఫ్ ఎడిటర్ మాదగాని సుగ్రీవుడు, 9441284503

హైదరాబాద్ | సోమవారం, జూన్ 29, 2026 | చీఫ్ ఎడిటర్ : మాదగాని సుగ్రీవుడు | సంపుటి:11 | సంచిక : 306 | పేజీలు: 8 | వెల : రూ.4

# కాంగ్రెస్‌కు చెక్.. కార్పొరేషన్లపై చేజిక్కించుకోండి

## పార్టీ శ్రేణులకు బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ పిలుపు

- జీహెచ్ఎంసీతో పాటు కీలక నగర కార్పొరేషన్లను కైవసం చేసుకోవాలి
- నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- కేంద్ర సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాలని సూచన
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ప్రజల ఆశయాలను దెబ్బతీశాయని ఆరోపణ
- ఐక్యతతో పనిచేసి నెల రోజుల్లో రాజకీయ వాతావరణాన్ని మార్చాలని పిలుపు



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా బీజేపీని బలోపేతం చేయడమే వచ్చే రెండున్నరేళ్ల ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పష్టం చేశారు. అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతూ ప్రతి స్థాయిలో పోరాటాలు నిర్వహించాలని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు సూచించారు. రాబోయే అన్ని ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలం పెంచేందుకు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్, ఖమ్మం తదితర మున్సిపల్ కార్పొరేషన్లలో విజయమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకూ చేర్చుతూ ప్రజల్లో విశ్వాసం పెంచాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నితిన్ నబిన్ విమర్శించారు. ఈ అంశంపై యువమోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టి విద్యార్థులు, యువతను చైతన్యపరచాలని చెప్పారు. తెలంగాణ సాధనలో బీజేపీ కీలక పాత్ర పోషించినప్పటికీ, అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజల ఆకాంక్షలను

(మిగతా 2వ పేజీలో)



# మూసీ ప్రక్షాళన ఆగదు!

## మూసీని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్

- రాష్ట్ర అభివృద్ధిపై శాసనసభలో బహిరంగ చర్చకు ప్రతిపక్షాలకు సవాల్
- 13,006 కోట్లతో 6,092 కి.మీ. రహదారుల నిర్మాణానికి శ్రీకారం
- ఎస్ఎల్‌బీసీ, డిండి పూర్తి చేసి నల్గొండకు సాగు, తాగునీరు హామీ
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలే తీర్పు చెబుతారని వ్యాఖ్య
- 2034 వరకూ కాంగ్రెస్ జెండానే ఎగురుతుందని ధీమా

నల్గొండ/హైదరాబాద్: మూసీ ప్రక్షాళన విషయంలో ఎలాంటి ఆటంకాలు వచ్చినా వెనక్కి తగ్గేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీని దేశానికి ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేస్తామని, కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న నల్గొండ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 13,006 కోట్లతో 6,092 కిలోమీటర్ల మేర చేపట్టనున్న 441 హ్యామ్ రహదారుల నిర్మాణ పనులకు ఆదివారం నల్గొండ జిల్లా కనగల్‌లో శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నల్గొండలో రూ. 83 కోట్ల తాగునీటి పథకానికీ భూమిపూజ చేశారు. భారాస నాయకులు మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు

(మిగతా 2వ పేజీలో)

## ఆ సినిమా టైటిల్‌కు అర్థం ఏమిటో పవన్‌కల్యాణ్‌ను అడగండి: కవిత



- 'ఇడుపు కాయితం' టైటిల్‌పై రాజుకున్న వివాదం
- అర్థం తెలియాలంటే పవన్‌ను అడగాలన్న కవిత
- తెలంగాణ యాసను రేవంత్‌రెడ్డి కాపాడటం లేదని విమర్శ
- ఉప్పల్‌లో జూలై 2న భూపోరాటానికి పిలుపు
- తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని ఆవేదన




### హనుమకొండలో ఘోర రోడ్డు ప్రమాదం..

## ఇంట్లోకి దూసుకెళ్లిన కారు, ఒకరి మృతి

- కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామ సమీపంలో ఘటన
- ముగ్గురికి తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

## ఇళ్ల కొనుగోళ్లలో ముందున్న బెంగళూరు, హైదరాబాద్.. ఢిల్లీలో తగ్గిన అమ్మకాలు

- దేశంలో భారీగా పెరిగిన ఇళ్ల అమ్మకాలు
- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 19 శాతం వృద్ధి నమోదు
- కొత్త ప్రాజెక్టుల ప్రారంభంలో 43 శాతం పెరుగుదల
- అమ్మకాల్లో బెంగళూరు, హైదరాబాద్, పుణె హవా
- ప్రాప్‌ఈక్విటీ నివేదికలో వెల్లడైన కీలక గణాంకాలు



## విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై నాని సంచలన ఆరోపణలు

- సీఎం రేవంత్‌కు ఫిర్యాదు
- హైదరాబాద్‌లో వేల కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నమంటూ ఆరోపణ
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన కేశినేని నాని
- భూకబ్జాను అడ్డుకుని, చిన్నిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్
- ఈడీ, ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలను దాచిపెట్టి మోసానికి పాల్పడుతున్నారని ఆరోపణ



హైదరాబాద్: విజయవాడ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఎంపీ, వైసీపీ నేత కేశినేని నాని.. తన సోదరుడు, ప్రస్తుత విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లక్ష్యంగా సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ శివార్లలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు చిన్ని ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోషల్ మీడియా వేదికగా ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ భూకబ్జా యత్నాన్ని తక్షణమే అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ నగర శివారులోని ప్రగతి నగర్, షంషిగూడ ప్రాంతంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు (టీజీఐఐసీ) చెందిన 112.72 ఎకరాల భూమి ఉంది. దీనిని ఐటీ పార్క్ కోసం కేటాయించారు. అయితే, ఈ అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎంపీ కేశినేని చిన్ని, ఆయన బినామీగా వ్యవహరిస్తున్న మెసర్స్ ఎక్సెల్లా ప్రాపర్టీస్ అనే సంస్థ అక్రమంగా

(మిగతా 2వ పేజీలో)



## బంగారం కొనుగోళ్లు తగ్గించారు

- ప్రజలకు మోదీ ధన్యవాదాలు
- బంగారం కొనుగోళ్లు, ఇంధన వాడకం ం తగ్గించినందుకు ప్రజలకు మోదీ ధన్యవాదాలు
- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని చేసిన విజ్ఞప్తికి అద్భుత స్పందన
- సీషెల్స్ పర్యటన నుంచే 135వ మన్ కీ బాత్‌లో ప్రసంగించిన ప్రధాని

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా తాను చేసిన విజ్ఞప్తికి స్పందించి, బంగారు కొనుగోళ్లు తగ్గించడంతో పాటు ఇంధనాన్ని పొదుపు చేసిన భారతీయులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ప్రసారమైన 135వ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ సంక్షోభ సమయంలో ప్రజలు కనబరిచిన ఈ సహకారం దేశ ఐక్యతకు, శక్తికి నిదర్శనమని కొనియాడారు. ప్రస్తుతం సీషెల్స్ పర్యటనలో ఉన్న ప్రధాని, అక్కడి నుండే ఈ కార్యక్రమం ద్వారా దేశప్రజలను

(మిగతా 2వ పేజీలో)

## మళ్లీ చర్చల బాట పట్టిన యుఎస్-ఇరాన్ ఇరు దేశాలు దాడుల నిలిపివేత

- పశ్చిమాసియాలో తాత్కాలికంగా తగ్గిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు
- వివాద పరిష్కారానికి దోహాలో రేపు ఇరు దేశాల సాంకేతిక చర్చలు
- 11 రోజుల ఒప్పందం విఫలమవడంతో పెరిగిన ఘర్షణలు
- సైన్యాల మధ్య ఘర్షణల నివారణకు హాట్‌లైన్ ఏర్పాటుపై దృష్టి
- దాడులు ఆగిపోవడంతో హర్మూజ్ జలసంధిలో సాధారణ స్థితి



పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన అమెరికా-ఇరాన్ వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఒకరిపై ఒకరు సైనిక దాడులు నిలిపివేయాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై తలెత్తిన వివాదాన్ని పరిష్కరించుకునేందుకు మంగళవారం(30న) ఖతార్ రాజధాని దోహాలో అత్యవసర సాంకేతిక చర్చలు జరపనున్నట్లు అమెరికా అధికారులు ధ్రువీకరించారు. జూన్ 17న కుదిరిన ఒప్పందం 11 రోజుల్లోనే విఫలమవడంతో ఈ కొత్త దౌత్య ప్రయత్నాలు తెరపైకి వచ్చాయి. ఆ ఒప్పందం ప్రకారం, ఇరాన్ ఓడరేవులపై అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. బదులుగా హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ భద్రత కల్పించాలి. అయితే, జలసంధి దాటే నౌకలు తమ అనుమతి తీసుకోవాలని ఇరాన్ పట్టుబట్టడం,

(మిగతా 2వ పేజీలో)

# మూసీ ప్రక్షాళన ఆగదు!

కోరుకుంటున్నారని చెప్పడం హాస్యాస్పదమని సీఎం విమర్శించారు. తెలంగాణ కోసం ఎవరు ఏమి చేశారనే అంశంపై ప్రత్యేక శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఏర్పాటు చేసి బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్రంలో పదేళ్ల భారాస పాలన, రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన, కేంద్రంలో పన్నెండేళ్ల భాజపా పాలనపై ప్రజల ముందే లెక్కలు చెప్పుకుందామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను దాచిపెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టిన భారాసకు ప్రజలను ప్రశ్నించే హక్కు లేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన అమరుల త్యాగాలతో అధికారంలోకి వచ్చామని చెప్పుకునే వారు, అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. రేషన్‌కార్డులు, పేదల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ విద్య, వైద్య రంగాలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును వచ్చే ఎన్నికల నాటికి పూర్తి చేసి 3.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. డిండి ప్రాజెక్టును కూడా పూర్తి చేసి ఉమ్మడి నల్గొండ జిల్లాకు తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. మూసీ కాలుష్యంతో ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పాదయాత్రలో ప్రత్యక్షంగా చూశానని, అందుకే మూసీ పునరుద్ధరణను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 30 నెలల్లోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం వెల్లడించారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, రేషన్‌కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, నైపుణ్య విశ్వవిద్యాలయం వంటి పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయినా రాష్ట్రాన్ని దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి చేసిన రాష్ట్రంగా నిలబెట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం,



సాయంత్రం అల్పాహారం అందిస్తున్నామని చెప్పారు. గురుకులాలను దేశంలోనే ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దుతున్నామని, ప్రభుత్వ ఉపాధ్యాయులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం జిల్లాలో వడ్డీలేని రుణాల కింద రూ.172 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. సభలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, రహదారుల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమ చర్యలపై వివరాలు వెల్లడించారు.

# ఆ సినిమా టైటిల్‌కు అర్థం ఏమిటో పవన్ కల్యాణ్‌ను అడగండి: కవిత

### 'ఇడుపు కాయితం' టైటిల్‌పై రాజుకున్న వివాదం
### అర్థం తెలియాలంటే పవన్‌ను అడగాలన్న కవిత
### తెలంగాణ యాసను రేవంత్ రెడ్డి కాపాడటం లేదని విమర్శ
### ఉప్పల్‌లో జూలై 2న భూపోరాటానికి పిలుపు
### తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని ఆవేదన

హైదరాబాద్: టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఇడుపు కాయితం' అనే సినిమా టైటిల్‌పై జరుగుతున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, ఆ పదానికి అసలైన అర్థం తెలియాలంటే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అడగాలని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉప్పల్‌లో తన పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఇడుపు కాయితం' సినిమా టైటిల్‌పై సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా తీవ్ర దుమారం రేగుతోంది. ముఖ్యంగా కొందరు ఆంధ్ర నెటిజన్లు తెలంగాణ యాసను, ఈ పదాన్ని కించపరిచేలా ట్రోల్ చేస్తుండటం వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో కవిత స్పందిస్తూ, తెలంగాణ భాష, అస్తిత్వంపై దాడి జరుగుతున్నా కాంగ్రెస్, బీజేపీ, చివరికి సొంత పార్టీ బీఆర్ఎస్ కూడా మౌనంగా ఉండటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "రాష్ట్రంలో మరోసారి ఉద్యమకాలం నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. అప్పుడు మనల్ని, మన భాషను ఎలా అయితే అవాకులు చెవాకులు పేలారో, ఇప్పుడు మళ్లీ అదే తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనమందరం ఈ విషయాన్ని గమనించుకోవాలి. నిన్నగాక మొన్న 'ఇడుపు కాయితం' అనే పేరుతో ఒక సినిమా వచ్చింది.



ఈ పేరు అర్థం కావడం లేదంటూ కొందరు దానిపై ట్రోలింగ్ చేస్తున్నారు. తెలంగాణ యాసను అవమానించడమే దీని వెనుక ఉన్న ఉద్దేశం. నేను ఒకటే సూటిగా అడుగుతున్నా... 'ఇడుపు కాయితం' అంటే అర్థం తెలియకపోతే, వెళ్లి సినిమా నటుడు పవన్ కళ్యాణ్‌ను అడగండి. ఆయనకు ఆ పదం అర్థం బాగా తెలుసు, కచ్చితంగా వివరిస్తారు. మా భాషను, యాసను అవహేళన చేసినందుకే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. ఇంకోసారి ఇటువంటి వెకిలి ప్రయత్నాలు చేయకండి. ఒకరి భాషను ఒకరం, ఒకరి సంస్కృతిని ఒకరం గౌరవించుకుందాం. అందరం కలిసే ఉందాం. కానీ, తెలంగాణను అవమానిస్తాం, మా భాషను కించపరుస్తాం అంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ఈరోజు తెలంగాణ భాషను ఇంతగా కించపరుస్తున్నా కాంగ్రెస్ పార్టీ నోరు మెదపదు. ఎందుకంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేదు. ఇక బీజేపీ సంగతి సరేసరి. దేశంలోని సమస్యలు తప్ప, తెలంగాణ గురించి వారికి పట్టదు. బీఆర్ఎస్ పార్టీ కూడా మాట్లాడదు. ఎందుకంటే, అందులో ఓ గుంటనక్క ఉంది. ఆయన వ్యాపారాలన్నీ ఇప్పటికీ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారితోనే ముడిపడి ఉన్నాయి" అని ఆరోపించారు.



## నిజామాబాద్‌లో ఉర్దూ బోధిస్తున్నారని ప్రిన్సిపాల్‌పై దాడి... బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలన్న షమా మహమ్మద్

### నిజామాబాద్‌లో ప్రిన్సిపాల్‌పై బీజేపీ నేతలు దాడి చేశారన్న ఆరోపణలు
### స్కూల్‌లో ఉర్దూ బోధించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన నేతలు
### సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జాతీయ నేత డిమాండ్
### పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందంటూ వీడియో వైరల్
### ఘటనకు నిరసనగా సోమవారం నిజామాబాద్ జిల్లా బంద్‌కు పిలుపు

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లాలో ఓ పాఠశాలలో ఉర్దూ బోధిస్తున్నారన్న కారణంతో ప్రిన్సిపాల్‌పై కొందరు బీజేపీ నేతలు దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసుల సమక్షంలోనే ప్రిన్సిపాల్‌ను చెంపదెబ్బ కొడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయంపై రాజకీయంగా దుమారం రేగింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని భారత్ చంద్ర పాఠశాలలో శనివారం ఈ ఘటన జరిగింది. పాఠశాల యాజమాన్యం ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ అమెర్ ఖాన్, ఉర్దూను ద్వితీయ భాషగా బోధించేందుకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు స్థానిక బీజేపీ నేతలు పాఠశాలలోకి ప్రవేశించి, తమ పిల్లలకు ఉర్దూ పాటలు, మతపరమైన అంశాలు నేర్పుతున్నారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే వారు ప్రిన్సిపాల్ అమెర్ ఖాన్‌పై దాడి చేసి, చెంపదెబ్బ కొట్టారు. ఈ ఘటనపై కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ షమా మొహమ్మద్ తీవ్రంగా స్పందించారు. ప్రిన్సిపాల్‌పై దాడి చేస్తున్న వీడియోను ఎక్స్ లో పోస్ట్ చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. "తెలంగాణలోని ఓ పాఠశాలలోకి బీజేపీ గూండాలు చొరబడి, పోలీసుల ముందే ఉర్దూ బోధిస్తున్న ఉపాధ్యాయుడిపై దాడి చేశారు. ఈ ఘటనలో సంబంధిత పోలీసు అధికారులను సస్పెండ్ చేసి, బీజేపీ గూండాలను కఠినంగా శిక్షించాలి" అని ఆమె డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ చెప్పే 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' ఎక్కడ? అని ఆమె ప్రశ్నించారు. మరోవైపు, విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకే ఉర్దూను రెండో భాషగా ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ అమెర్ ఖాన్ తెలిపారు. తనను, మరో ఉపాధ్యాయుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, చాలాసేపు నేలపై కూర్చోబెట్టారని, దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. ఈ ఘటనను మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) నేత అంజద్ ఉల్లా ఖాన్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ క్రమంగా ఆరెస్సెస్ ప్రయోగశాలగా మారుతోందని ఆయన ఆరోపించారు. ఈ దాడికి నిరసనగా సోమవారం నిజామాబాద్ జిల్లా బంద్‌కు పలు సంస్థలు పిలుపునిచ్చాయి. ఈ ఘటనతో జిల్లాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ఇళ్ల కొనుగోళ్లలో ముందున్న బెంగళూరు, హైదరాబాద్.. ఢిల్లీలో తగ్గిన అమ్మకాలు

### దేశంలో భారీగా పెరిగిన ఇళ్ల అమ్మకాలు
### ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 19 శాతం వృద్ధి నమోదు
### కొత్త ప్రాజెక్టుల ప్రారంభంలో 43 శాతం పెరుగుదల
### అమ్మకాల్లో బెంగళూరు, హైదరాబాద్, పుణె హవా
### ప్రాప్‌ఈక్విటీ నివేదికలో వెల్లడైన కీలక గణాంకాలు

భారత రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్ 2026) బలమైన పనితీరు కనబరిచింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ, దేశీయంగా ఇళ్ల అమ్మకాలు, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం భారీగా పెరిగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, ఈ రంగంలో సానుకూల వృద్ధి నమోదైంది. నివేదికలోని ముఖ్యాంశాలను పరిశీలిస్తే, 2026 ఏప్రిల్–జూన్ మధ్య కాలంలో దేశంలోని 9 ప్రధాన నగరాల్లో మొత్తం 1,12,458 నివాస గృహాలు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే సమయంలో అమ్ముడైన 94,864 యూనిట్లతో పోలిస్తే ఇది 19 శాతం అధికం. అమ్మకాలతో పాటే కొత్త ప్రాజెక్టుల సరఫరా కూడా గణనీయంగా పెరిగింది. గతేడాది 82,159 యూనిట్ల కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కాగా, ఈ ఏడాది ఏకంగా 43 శాతం వృద్ధితో 1,17,609 యూనిట్లు మార్కెట్లోకి వచ్చాయి. ముంబై, నవీ ముంబై, థానే, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, పుణె, కోల్‌కతా నగరాల్లోని డేటాను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. నగరాల వారీగా చూస్తే, దక్షిణాది నగరాలు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా బెంగళూరులో అమ్మకాలు భారీగా పెరిగాయి. గతేడాది 14,676 యూనిట్లు అమ్ముడవగా, ఈసారి 21,516 యూనిట్లకు చేరాయి. హైదరాబాద్‌లో కూడా అమ్మకాలు స్థిరంగా కొనసాగి, 14,410 యూనిట్లుగా నమోదయ్యాయి. శాతం వారీగా అత్యధిక వృద్ధి నవీ ముంబైలో కనిపించింది. అక్కడ అమ్మకాలు సుమారు 61 శాతం పెరిగి 11,029 యూనిట్లకు చేరాయి. చెన్నై (6,323), ముంబై (10,561), థానే (16,386), పుణె (18,737) నగరాల్లో కూడా అమ్మకాలు పెరిగాయి. అయితే, దేశ రాజధాని ప్రాంతమైన ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో మాత్రం అమ్మకాలు 11,703 నుంచి 10,082 యూనిట్లకు తగ్గాయి. కోల్‌కతాలో కూడా 4,449 నుంచి 3,414 యూనిట్లకు విక్రయాలు పడిపోయాయి. ఈ గణాంకాలపై ప్రాప్‌ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈఓ సమీర్ జసుజా మాట్లాడుతూ, "పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ అనిశ్చితి ఉన్నప్పటికీ భారత గృహ విపణి తన స్థిరత్వాన్ని నిరూపించుకుంది. ముఖ్యంగా దక్షిణాది మార్కెట్లు, ముంబై, నవీ ముంబైలలో డిమాండ్ బలంగా ఉంది," అని తెలిపారు. ఢిల్లీ–ఎన్‌సీఆర్, థానే వంటి కొన్ని ప్రాంతాల్లో మందగమనం కనిపించినా, మొత్తం మీద మార్కెట్ సెంటిమెంట్ సానుకూలంగానే ఉందని ఆయన వివరించారు. పరిశ్రమ వర్గాల ప్రకారం, కొనుగోలుదారులలో పెరిగిన విశ్వాసం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరగడం (ముఖ్యంగా బెంగళూరు వంటి నగరాల్లో), బలమైన ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ విధానాల మద్దతు వంటి అంశాలు ఈ రంగానికి రక్షణగా నిలుస్తున్నాయి. డెవలపర్లు కూడా పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా కొత్త ప్రాజెక్టులను వేగంగా ప్రారంభిస్తుండటం మార్కెట్ ఆరోగ్యంగా ఉందనడానికి సంకేతమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కాంగ్రెస్‌కు చెక్.. కార్పొరేషన్లపై చేజిక్కించుకోండి

నెరవేర్చలేదని ఆరోపించారు. ముఖ్యంగా సాగునీటి రంగంలో అవినీతి కారణంగా రైతులు నష్టపోయారని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని, అందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని నితిన్ నబిన్ సూచించారు. కుల, వర్గ విభేదాలకు తావులేకుండా 'పార్టీ ముందుగా, నాయకుడు తర్వాత' అనే భావనతో పనిచేయాలని స్పష్టం చేశారు. నెల రోజుల్లోనే రాజకీయంగా అనుకూల వాతావరణం సృష్టించాలని, ఆ తర్వాత పార్టీ అధిష్ఠానం తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చేరుకున్న నితిన్ నబిన్ రంగారెడ్డి రూరల్ జిల్లా కార్యాలయంతో పాటు మరో ఎనిమిది జిల్లా కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం బూత్ స్థాయి అధ్యక్షులతో సమావేశమై ఎన్నికల సన్నాహాలపై మార్గనిర్దేశం చేశారు. సోమవారం విద్యార్థులు, యువతతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్న ఆయన, అనంతరం వరంగల్‌లో గిరిజన నాయకులు, బూత్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలతో వరుస సమావేశాలు నిర్వహించి రాష్ట్రవ్యాప్త పర్యటనను కొనసాగించనున్నారు.

## హనుమకొండలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇంట్లోకి దూసుకెళ్లిన కారు, ఒకరి మృతి

### కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామ సమీపంలో ఘటన
### ముగ్గురికి తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం
### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హనుమకొండ : హనుమకొండ జిల్లాలో ఈ రోజు ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామం సమీపంలో వేగంగా వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి తొలుత డివైడర్‌ను ఢీకొట్టి, అనంతరం రోడ్డు పక్కనే ఉన్న ఒక ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడిని కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన కళ్లెం శ్రీనివాస్‌గా గుర్తించారు. ఉప్పల్ గ్రామంలో తన స్నేహితుడిని దింపి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ దుర్ఘటనతో ఉప్పల్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై నాని సంచలన ఆరోపణలు

చేజిక్కించుకోవాలని చూస్తున్నాయని కేశినేని నాని తన లేఖలో ఆరోపించారు. ఈ భూమిపై ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు ఆదేశాలు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆంక్షలు అమల్లో ఉన్నాయని, ఈ కీలక విషయాలను దాచిపెట్టి మోసానికి పాల్పడుతున్నారని నాని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను మరుగునపరిచి, సుప్రీంకోర్టులో ఒక మోసపూరిత రాజీ ఒప్పందాన్ని చూపి ప్రభుత్వ భూమిని కొట్టేయాలని కుట్ర చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. గతంలో జిల్లా కలెక్టర్ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఈ భూమిపై ప్రైవేటు వ్యక్తులకు ఎలాంటి హక్కులు లేవని (జీరో ప్రైవేట్ టైటిల్) స్పష్టంగా ఉన్నప్పటికీ, అక్రమార్కులు రాత్రికి రాత్రే ఆక్రమణలు మొదలుపెట్టారని నాని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేశినేని నాని కోరారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు అడ్వకేట్ జనరల్ ద్వారా న్యాయస్థానాల్లో జోక్యం చేసుకుని, ఈ అక్రమ భూ బదలాయింపును నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' యంత్రాంగాన్ని వెంటనే రంగంలోకి దించి, ఇప్పటికే మొదలైన అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. నకిలీ పత్రాలు, మోసపూరిత ఒప్పందాలతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఆయన బినామీలు, సూత్రధారులపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఆరోపణలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## బంగారం కొనుగోళ్లు తగ్గించారు

ఉద్దేశించి ప్రసంగించారు. దేశ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనేక కుటుంబాలు నూతన బంగారు ఆభరణాల కొనుగోళ్లకు దూరంగా ఉండి, వివాహ వేడుకలకు పాత బంగారాన్నే పునర్వినియోగించడం అభినందనీయమన్నారు. అలాగే, అనేకమంది తమ విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవడం, కార్‌పూలింగ్ పాటించడం మరియు మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను ఆశ్రయించడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేశారని ప్రశంసించారు. ఈ సామూహిక కృషి అంతర్జాతీయ వేదికపై భారతదేశ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జూన్ మాసంలో రక్షణ రంగంలో దేశం సాధించిన విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అహ్మదాబాద్‌లో నిర్వహించిన వరల్డ్ యోగా ఆసనా ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు కనబరిచిన అద్భుత ప్రతిభను ఆయన అభినందించారు. ఈ పోటీలలో భారత్ 102 స్వర్ణాలతో పాటు మొత్తం 114 పతకాలు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ద్వీప దేశాల అభివృద్ధికి భారత్ అందిస్తున్న తోడ్పాటుకు గుర్తింపుగా, సీషెల్స్‌లో ప్రధాని 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్' పురస్కారాన్ని అందుకున్న విషయం తెలిసిందే.

## మళ్లీ చర్చల బాట పట్టిన యుఎస్-ఇరాన్ ఇరు దేశాలు దాడుల నిలిపివేత

అమెరికా వ్యతిరేకించడంతో వివాదం ముదిరింది. ఈ క్రమంలోనే వారాంతంలో ఇరు దేశాల మధ్య దాడులు చోటుచేసుకున్నాయి. వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా, అమెరికా సెంట్రల్ కమాండ్ ఇరాన్ సైనిక స్థావరాలపై వైమానిక దాడులు జరిపింది. దీనికి బదులుగా ఇరాన్.. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ దాడుల్లో అమెరికా సైనికులకు ప్రాణనష్టం జరగకపోయినా, స్వల్ప ఆస్తి నష్టం వాటిల్లింది. ఇరాన్ ఒప్పందాన్ని గౌరవించకపోతే "పని పూర్తి చేస్తాం" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చొరవతో చర్చలు పునఃప్రారంభమయ్యాయి. అమెరికా సాంకేతిక బృందానికి నిక్ స్టెవర్ట్ నాయకత్వం వహించనున్నారు. ఇరు దేశాల సైన్యాల మధ్య, ముఖ్యంగా యూఎస్ మిలిటరీ, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ మధ్య కమ్యూనికేషన్ హాట్‌లైన్‌ను ఏర్పాటు చేసి భవిష్యత్తులో సముద్ర ఘర్షణలను నివారించడమే ఈ చర్చల ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం దాడులు నిలిచిపోవడంతో హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్నాయి.

# 30 ఫీట్ల రోడ్డును కాపాడాలని కైలాష్ హిల్స్‌వాసుల ధర్నా

**మన్ భూమి నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటన**




కుత్బుల్లాపూర్ జూన్ 28(ప్రజాజ్వాల) తమ కాలనీలోని 30 ఫీట్ల సీసీ రోడ్డును ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ మహాదేవపురం డివిజన్ పరిధిలోని కైలాష్ హిల్స్ కాలనీ వాసులు ఆదివారం భారీ ధర్నా నిర్వహించారు. కైలాష్ హిల్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీ కమాన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు. "సేవ్ అవర్ రోడ్ -- సేవ్ అవర్ కమ్యూనిటీ -- సేవ్ అవర్ ఫ్యూచర్" అంటూ నినాదాలు చేస్తూ రోడ్డు ఆక్రమణలను అడ్డుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్నా అనంతరం నిర్వహించిన సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ, మన్ భూమి నిర్మాణ సంస్థ కాలనీలోని 30 ఫీట్ల రహదారిని ఆక్రమిస్తూ ప్రహరీ నిర్మాణం చేపడుతోందని ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు అక్రమ నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, చిన్నచిన్న ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకుంటున్న అధికారులు పెద్ద ఎత్తున జరుగుతున్న నిర్మాణాలపై మాత్రం స్పందించడం లేదని వారు విమర్శించారు. ఈ వ్యవహారంపై సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, ఈ అంశం సివిల్ వివాదమని పేర్కొంటూ ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని సూచించారని, న్యాయపోరాటం చేస్తే తమపైనే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారని కాలనీ వాసులు ఆరోపించారు. రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాల్సిన సమయంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపించిన కాలనీ వాసులు, హైడ్రా అధికారులు అయినా జోక్యం చేసుకుని వాస్తవ పరిస్థితులను పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు చెందిన 30 ఫీట్ల రహదారిని పరిరక్షించి న్యాయం చేయాలని కోరారు. కాలనీలోని రహదారి పూర్తిస్థాయిలో పరిరక్షించబడే వరకు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కైలాష్ హిల్స్ సంక్షేమ సంఘం నాయకులు, స్థానికులు స్పష్టం చేశారు.

# జగద్గిరిగుట్ట రింగుబస్తి రోడ్డులో నీటి లీకేజీ సమస్య

**శాశ్వత పరిష్కారం చూపాలి**

**పంతుల సాయికుమార్ పటేల్ డిమాండ్**





జగద్గిరిగుట్ట, జూన్ 28 (ప్రజాజ్వాల ప్రతినిధి): జగద్గిరిగుట్ట రింగుబస్తి రోడ్డులో ఏళ్లుగా కొనసాగుతున్న నీటి లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ రాష్ట్ర నాయకుడు పంతుల సాయికుమార్ పటేల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గిరిగుట్ట కన్యాకా పరమేశ్వరి ఆలయం నుంచి రింగుబస్తి రోడ్డు మార్గంలోని వేద పాఠశాల ఎదురుగా సంవత్సరాలుగా నిరంతరంగా నీరు ప్రవహిస్తోందని తెలిపారు. స్థానికుల సమాచారం ప్రకారం గత ప్రభుత్వ హయాంలో ఈ నీటిని గోవిందరాజ స్వామి కోనేరులోకి మళ్లించే ఏర్పాటు ఉండేదని, అయితే ఇటీవల హైడ్రా చర్యల నేపథ్యంలో ఆ మార్గం మూసుకుపోవడంతో ప్రస్తుతం నీరు రోడ్డుపైకి వస్తోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. ప్రస్తుతం రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు జగద్గిరిగుట్ట కొండపై ఉన్న వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి వస్తోందని కొందరు, భద్రకాళి ఆలయం వెనుక ప్రాంతం నుంచి వస్తోందని మరికొందరు, డ్రైనేజ్ నీరని ఇంకొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అందువల్ల ఈ నీటి మూలం ఏమిటి, అది మంచినీరా లేక డ్రైనేజ్ నీరా అనే విషయాన్ని అధికారులు వెంటనే నిర్ధారించాలని డిమాండ్ చేశారు. కన్యాకా పరమేశ్వరి ఆలయం నుంచి ఫంక్షన్ హాల్ మీదుగా మగ్దుం నగర్ రోడ్డు వరకు ప్రతిరోజూ నీరు ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. రోడ్లు దెబ్బతినడం, దోమల వ్యాప్తి, దుర్వాసనతో పాటు ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ వాటర్ బోర్డు, డ్రైనేజ్ శాఖ, హైడ్రా తదితర సంబంధిత అధికారులు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించి, నీటి మూలాన్ని గుర్తించి శాశ్వత డ్రైనేజ్ లేదా పైప్‌లైన్ ఏర్పాటు ద్వారా సమస్యకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజల తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరమేష్, జీవన్, రాహుల్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్య రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ఐదేళ్లలోపు ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు తప్పనిసరి: నీలం మధు ముదిరాజ్**





పటాన్‌చెరు, జూన్ 28 (ప్రజాజ్వాల): దేశ భవిష్యత్తు చిన్నారుల ఆరోగ్య భద్రతపైనే ఆధారపడి ఉంటుందని, ఐదేళ్లలోపు ప్రతి బిడ్డకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. పల్స్ పోలియో నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తన స్వగ్రామం చిట్కుల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య సిబ్బందితో కలిసి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నీలం మధు ముదిరాజ్, పోలియో మహమ్మారిని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా పల్స్ పోలియో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి విడతలోనూ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఒకప్పుడు దేశాన్ని పట్టిపీడించిన పోలియో వ్యాధిని నిరంతర టీకా కార్యక్రమాల ద్వారానే నియంత్రించగలిగామని, అదే పట్టుదలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ, ప్రభుత్వం నిర్వహించే ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు చిన్నారులకు మళ్లీ చుక్కలు వేయించడం సురక్షితమని, ఇది రోగనిరోధక శక్తిని మరింత బలోపేతం చేస్తుందని వివరించారు.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామం, వార్డులో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి వంద శాతం పోలియో చుక్కల పంపిణీ లక్ష్యాన్ని సాధించాలని కోరారు. ఎండలు, వానలను లెక్కచేయకుండా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బంది సేవలను ఆయన అభినందించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మొబైల్ పోలియో కేంద్రాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జగద్గిరిగుట్టలో పల్స్ పోలియో కార్యక్రమం

**చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి**

జగద్గిరిగుట్ట జూన్ 28,( ప్రజాజ్వాల ప్రతినిధి): జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా జగద్గిరిగుట్టలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టేందుకు ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శృతి విద్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ట్రస్మా సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శృతి విద్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు

**మంజూరు చేసినందుకు**

**మంత్రి దామోదరకు హృదయపూర్వక కృతజ్ఞతలు**



అందోల్, జూన్ 28 (ప్రజాజ్వాల): అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్ల ప్రత్యేక నిధులను మంజూరు చేయడంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అందోల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఊతమిచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నాయకత్వానికి ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యా ఇతర ప్రజా అవసరాల పనులు వేగవంతం కానున్నాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం పట్ల ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి ఈ నిధుల మంజూరు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అందోల్ నియోజకవర్గానికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ అందోల్ నియోజకవర్గ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), మర్రి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మర్రి అరుణ కుమారి సంయుక్తంగా హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ నిధులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ నాయకత్వంలో అందోల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి ఆదర్శ నియోజకవర్గంగా నిలుస్తుందనే విశ్వాసాన్ని వారు వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ఈ నిర్ణయం నిదర్శనమని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



## పోలియో నిర్మూలనకు ప్రతి చిన్నారికి వ్యాక్సిన్ తప్పనిసరి

**కాంగ్రెస్ నాయకులు చిలుకూరి మహేందర్‌రెడ్డి**

జగదేవపూర్, జూన్ 28 (ప్రజాజ్వాల): పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి పోలియో వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు చిలుకూరి మహేందర్ రెడ్డి అన్నారు. జగదేవపూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కుక్కనూరు కృష్ణ, ఉపసర్పంచ్ రామచంద్రంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోలియో వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న టీకా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.






# కెడిఆర్ బ్లిట్జ్ అద్వర్యంలో నాచారంలో ఘనంగా టైక్వాండో పురస్కారాలు

హైదరాబాద్ , జూన్ 28, (ప్రజాజ్వాల ) : తార్నాక పరిధిలో నాచారం కె డి ఆర్ సంస్థ అద్వర్యం లో నాచారం లోని ఇంద్ర స్కూల్ లో నిర్వహించిన పోటీల్లో పిల్లలకు యువకులకు టైక్వాండో లో భాగంగా పలు పురస్కారాలు ప్రశంశ పత్రాలను అందజేశారు. పిల్లల్లో చదువులతో పాటు శారీరక దృఢత్వం అవసరమని కె డి ఆర్ బ్లిట్జ్ వ్యవస్థాపకులు కె దయాకర్ రావు ఈ సందర్భంగా తెలియజేసారు. బాలికలకు ఆపద సమయంలో తమకు తాము రక్షణ కల్పించుటకు టైక్వాండో చాలా అవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని తమ పిల్లలు చేస్తున్న విన్యాసాలను చూసి మురిసిపోయారు. తమ పిల్లల్లో మానసిక ధైర్యం ఇదివరకు కన్న ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుందని తల్లిదండ్రులు కె డి ఆర్ సంస్థకు అభినందనలు తెలియజేసారు. ఇందులో కె డి ఆర్ బ్లిట్జ్ వ్యవస్థాపకులు మరియు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు గ్రహీత దయాకర్ రావు తో పాటు ఇదే సంస్థలో నేర్చుకొని తిరిగి పలువురికి శిక్షణలు అందిస్తున్న అల్వాపురి సురేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కార్మికుల ఐక్యతకు నిదర్శనం

### నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన కె.యం. ప్రతాప్





కుత్బుల్లాపూర్, జూన్ 28 (ప్రజాజ్వాల ప్రతినిధి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్ గ్రామం న్యూ ప్రశాంత్ నగర్‌లో శ్రీ దుర్గా భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం. ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కె.యం. ప్రతాప్ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ పనికి అత్యంత కీలకమైన పాత్ర ఉందని పేర్కొన్నారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఐకమత్యంతో ముందుకు సాగుతూ సొంత భవనాన్ని నిర్మించుకొని అందులో అసోసియేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. కార్మికుల సంక్షేమం కోసం సంఘం చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని అన్నారు. భవన నిర్మాణ పనుల సమయంలో సెంట్రింగ్ కార్మికుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాల నివారణకు అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రతి కార్మికుడికి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీ దుర్గా భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతాప్, కార్మికుల ఐక్యతే సంఘ బలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జై దుర్గా భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు పి. శ్రీనివాస్, ఎన్. అశోక్, సలహాదారులు బి. వెంకటేశ్వరరావు, వి. ఇంద్రసేనారెడ్డి, పి. నరసింహారెడ్డి, టి. నాగేశ్వరరావు, అధ్యక్షుడు కుంట వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు సీహెచ్. సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి జీ. ప్రవీణ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వి. రాకేష్, కోశాధికారి టి. శివశంకర్, ఆర్గనైజర్లు ఈశ్వర్, కృష్ణ, మహంకాళిరావు, సత్యనారాయణ, ముని, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వచ్ఛ కాలనీ - స్వచ్ఛ జీవనం కార్యక్రమం

### ఉత్సాహంగా పాల్గొన్న కాలనీవాసులు



గాజులరామారం, జూన్ 28 (ప్రజాజ్వాల ప్రతినిధి): గాజులరామారం సర్కిల్ పరిధిలోని మహదేవపురం డివిజన్, కరణం కమలమ్మ కాలనీలో కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన "స్వచ్ఛ కాలనీ -- స్వచ్ఛ జీవనం" కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ నివాసితులు, సానిటైజేషన్ విభాగం సిబ్బందితో కలిసి కాలనీలోని రహదారులపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అని పేర్కొన్న కాలనీవాసులు, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు కాలనీ మొత్తాన్ని శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. కాలనీని పరిశుభ్రంగా నిర్వహించడం ద్వారా దోమలు, ఈగలు మరియు అంటువ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కాలనీవాసులందరూ రాబోయే రోజుల్లో కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, మహిళలు, యువత, కాలనీవాసులు మరియు సానిటైజేషన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో హెల్ప్ డెస్క్ ప్రారంభించిన కొలన్ హన్మంత్‌రెడ్డి

### నందానగర్‌లో పోలియో కేంద్రం సందర్శన
### ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన





కుత్బుల్లాపూర్, జూన్ 28(ప్రజాజ్వాల): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆదివారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. అనంతరం నందానగర్‌లో నిర్వహిస్తున్న పోలియో చుక్కల కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే కార్యక్రమాన్ని పరిశీలించారు. అదే రోజు నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ )కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఓటరు నమోదు సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అలాగే బీఎల్ఓలు అందించే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఓటరు నమోదుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జలీల్ ఖాన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవి, మహమ్మద్ పాషా, ఎల్లేష్, కాక, నీలా గుప్తా, రాజు, మహమ్మద్ గౌస్, మహమ్మద్ మఖసూద్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా సేవలు, ఆరోగ్య రక్షణ, ఓటరు నమోదు కార్యక్రమాల పట్ల కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని నాయకులు తెలిపారు.



## సోమయ్యనగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

కుత్బుల్లాపూర్, జూన్ 28(ప్రజాజ్వాల): జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సోమయ్య నగర్‌లో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు సోమవారం బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శంకుస్థాపన చేశారు. సాలాసార్ హనుమాన్ దేవాలయం దాతల సహకారంతో సుమారు రూ. 3.50 లక్షల వ్యయంతో ఈ కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, స్థానిక ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఈ కమ్యూనిటీ హాల్ ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. సోమయ్య నగర్ అభివృద్ధికి ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం మరో మైలురాయిగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సోమయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తోక యాదగిరి, వైస్ ప్రెసిడెంట్ సతీష్, జనరల్ సెక్రటరీ గణేష్, సభ్యులు దుర్గేష్, మనోజ్, ఉదయ్, నవీన్, సత్తిరెడ్డి, కుమారస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గచ్చిబౌలి, జూన్ 29 (ప్రజాజ్వాల): గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం, జూన్ 18న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు చెందిన పీసీ లాలయ్య (పీసీ నెం. 4848), డ్రైవర్ ఖలీమ్ పెట్రోల్ మొబైల్-2లో విధులు నిర్వహిస్తుండగా డయల్-100 ద్వారా సమాచారం అందింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) టోల్ ప్లాజా-19 సమీపంలోని హోండా షోరూమ్ వెనుక భాగంలో డివైడర్‌పై ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించలేదని, నల్లరంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సెక్టార్ మహిళా ఎస్సై పరమేశ్వరి దర్యాప్తు చేపట్టారు. మృతుడిని ఎవరైనా గుర్తించినా లేదా అతనికి సంబంధించిన సమాచారం తెలిసినా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అలాగే, ఇటీవల అదృశ్యమైన వ్యక్తుల వివరాలు కలిగిన కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదించి సహకరించాలని కోరారు.



## గిరినగర్ డివిజన్‌లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణ

కుత్బుల్లాపూర్, జూన్ 28(ప్రజాజ్వాల): చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గిరినగర్ డివిజన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కె. శ్రీకాంత్ యాదవ్, ఎ. శ్రీనివాస్ ముదిరాజ్, బి. భాస్కర్ చారి, తైలం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కోరారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని, ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొన్నారు.

## 'ఇడుపు కాయితం'పై రగడ.. తెలంగాణ భాషపై గరికపాటి పాత కామెంట్స్ వైరల్!

**ప్రియదర్శి 'ఇడుపు కాయితం' సినిమా టైటిల్‌పై సోషల్ మీడియాలో వివాదం**

**ఆంధ్రా, తెలంగాణ నెటిజన్ల మధ్య భాషాపరమైన వాగ్వాదానికి దారితీసిన ట్రోల్స్**

**తెలంగాణ భాష శాస్త్రీయమైందని, గ్రాంథికానికి దగ్గరగా ఉంటుందన్న గరికపాటి**



ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో, సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు సమర్పణలో వస్తున్న 'ఇడుపు కాయితం' సినిమా టైటిల్ సోషల్ మీడియాలో పెద్ద దుమారాన్నే రేపుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన నాటి నుంచి ఈ పేరుపై మొదలైన చర్చ, ఇప్పుడు ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల మధ్య భాషా వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు గతంలో తెలంగాణ భాషపై చేసిన వ్యాఖ్యల వీడియో ఒకటి ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

# కొడిపల్లిలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం

### జిల్లా సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్





కొడిపల్లి ,జూన్ 28 (ప్రజాజ్వాల) : మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని కౌడిపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం నందు ప్రారంభించి స్వయంగా ఆయన పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా పల్స్ పోలియో చుక్కలను వేయించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, కౌడిపల్లి గౌడ సంఘం అధ్యక్షులు చంద్రం కిషోర్ గౌడ్, వార్డ్ సభ్యులు మాధవి మహేష్, దేవేందర్, మక్బూల్ నాయకులు రాగుల భూమయ్య పటేల్, కౌడిపల్లి గ్రామ కారోబార్ ఎల్లం ఏఎన్ఎం అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### బొంగునూరి కిషోర్ రెడ్డి
### 48వ ఉచిత వైద్య శిబిరం ప్రారంభం






కుత్బుల్లాపూర్, జూన్ 28 (ప్రజాజ్వాల ప్రతినిధి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని చింతల్ 282 డివిజన్ శ్రీనివాస నగర్ కాలనీలో నిర్వహించిన 48వ ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ ఓ కో–ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. శ్రీనివాస నగర్ కాలనీ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో పలువురు నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె. పృథ్వీరాజ్, ఫలూర్ రెహమాన్, వెంకటేష్ (బిల్లా), జగన్, సాధు యాదవ్, గజ, సింధేష్, మనోజ్, చెన్నమ్మ, నాగమణి, స్వప్న, కమల, సాయిబాబు, 282 డివిజన్ శ్రీనివాస నగర్ కాలనీ వాసులు, టీమ్ బీకేఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గోవాకు వెళ్లేవారికి సూపర్ న్యూస్... వాటర్ మెట్రోలో షికారుకెళ్లొచ్చు...

గోవా తీరంలో కొత్త వాటర్ మెట్రో ప్రాజెక్ట్ రాబోతోంది. నదులు, కాలువలు ఆధారంగా సులభమైన, పర్యావరణహిత ప్రయాణ వ్యవస్థ రూపుదిద్దుకోనుంది. నగర రవాణా మరింత వేగంగా, సౌకర్యంగా మారే దిశలో ఇది పెద్ద అడుగు. కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ గోవా వాటర్ మెట్రో ప్రాజెక్ట్‌ను ఫేజ్–1 ప్రాధాన్యంగా అమలులోకి తీసుకువచ్చినట్టు ప్రకటించారు. ఈ ప్రకటన గోవా కొత్త కెప్టెన్ ఆఫ్ పోర్ట్స్ టెర్మినల్ బిల్డింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జరిగింది. ఆ కార్యక్రమంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సోనోవాల్ మాట్లాడుతూ గోవా జల మార్గాలు ఉపయోగించి ప్రయాణ సౌకర్యం పెరుగుతుందని, పర్యావరణహిత నగర రవాణా బలపడుతుందని చెప్పారు. పర్యాటక రంగానికి కూడా ఇది ఊతమిస్తుందని అన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం రాష్ట్ర రివర్ నావిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇటీవల గోవా వాటర్ మెట్రో ప్రాజెక్ట్ సాధ్యత నివేదికను ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌కు సమర్పించింది. గతంలో రవాణా శాఖ మంత్రి సుభాష్ ఫాల్ దెసాయ్ తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 8 నది మార్గాలు పనిచేయడానికి అనుకూలంగా గుర్తించారు. ఈ మార్గాల్లో 111 కిలోమీటర్ల నెట్‌వర్క్‌లో 32 ఫెర్రీ టెర్మినల్స్ ద్వారా 87 నౌకలు నడపాలని ప్రతిపాదన ఉంది. అదనంగా సముద్ర మార్గం కలిగిన తొమ్మిదవ రూట్ అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం సుమారు 3,146 కోట్ల రూపాయలు. ఈ నివేదిక కోచి మెట్రో రైల్ లిమిటెడ్ (కెఎంఆర్ఎల్) చేసిన సర్వేలు, అధ్యయనాల ఆధారంగా తయారైంది. గత ఏడాది నుంచి నిపుణులు గోవాలో పరిశీలనలు చేశారు. కేరళ వాటర్ మెట్రో విజయ మోడల్ నుంచి ప్రేరణ తీసుకున్నట్టు అధికారులు చెప్పారు. భారత్‌లో ఈ తరహా ప్రాజెక్ట్‌కు గోవా చాలా అనుకూలమైన ప్రాంతాల్లో ఒకటిగా గుర్తించారు. ఈ ప్రాజెక్ట్‌లో ప్రధానంగా మండోవీ, జువారి నదులలో ఉన్న నావిగేషన్ మార్గాలు ఉపయోగిస్తారు. కొన్ని తీర ప్రాంత మార్గాలు కూడా కలుపుతారు. ముఖ్య టెర్మినల్స్‌గా పనాజీ, బెటిమ్, కార్టాలిమ్, ఓల్డ్ గోవా, వాస్కో డా గామా, డోనా పౌలా, ఫోర్ట్ అగ్వాడా, చాపోరా, కుమ్బర్జువా, దివార్ దీవి, చోరావ్ దీవి, తిరాకోల్ ఉన్నాయి. అదనంగా మడ్కై, రాయిబందర్, బ్రిట్టోనా, రీస్ మాగోస్, నర్వే, ధౌజి, గౌండాలిం, క్యూరిమ్ వంటి ప్రాంతాల్లో కూడా టెర్మినల్స్ ప్రతిపాదించారు. ఈ వాటర్ మెట్రో ప్రాజెక్ట్ గోవా రవాణా రూపాన్ని మార్చే అవకాశం ఉంది. నదులు కేవలం ప్రకృతి అందం మాత్రమే కాకుండా రోజువారీ ప్రయాణానికి కీలక మార్గాలుగా మారే దిశలో ఇది ఒక కొత్త ఆరంభం. మొత్తంగా ఈ ప్రాజెక్ట్ గోవా అభివృద్ధి, పర్యావరణహిత రవాణా, పర్యాటక రంగం మధ్య సమతుల్యం తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.



# ఆఫీస్‌కి వెళ్లడానికి మంచి మైలేజ్ ఇచ్చే కంఫర్ట్ స్కూటర్స్ ఇవే..



ఆఫీసుకి వెళ్లడానికి స్టైల్‌గా, మంచి ఫర్ఫామెన్స్ ఇచ్చే స్కూటర్ కోసం మీరు ఎదురుచూస్తున్నారా.. అయితే ఈ సమాచరం మీకోసమే. కంఫర్ట్ బడ్జెట్‌లో మంచి మైలేజ్ ఇచ్చే స్కూటర్లు ఇవే. మీకు ఏవి సెట్ అవుతాయో చూసుకోండి. మీరు ఆఫీసుకి వెళ్లడానికి తక్కువ ధరలో, అందమైన, మంచి మైలేజీనిచ్చే స్కూటర్ కోసం చూస్తున్నట్లయితే మీకు ఈ సమాచారం బాగా ఉపయోగపడుతుంది. మార్కెట్లో ఉన్న పదుల సంఖ్యలో కంపెనీల స్కూటర్లతో పాటు ఎలక్ట్రిక్, వెహికల్స్ వందల సంఖ్యలో రోజుకో మోడల్ చొప్పిన వాహనదారులను అయోమయానికి గురి చేస్తున్నాయి. ఇలాంటి టైమ్‌లో రెగ్యులర్‌గా ఆఫీస్ కోసం వాడుకునే బైక్ కావాలంటే ఈ కింద ఇచ్చిన సమాచారాన్ని చూసి మీకు సరిగ్గా సూట్ అయ్యేదాన్ని సెలక్ట్ చేసుకోండి. మీరు ఆఫీసుకి వెళ్లడానికి తక్కువ ధరలో, అందమైన, మంచి మైలేజీనిచ్చే స్కూటర్ కోసం చూస్తున్నట్లయితే మీకు ఈ సమాచారం బాగా ఉపయోగపడుతుంది. మార్కెట్లో ఉన్న పదుల సంఖ్యలో కంపెనీల స్కూటర్లతో పాటు ఎలక్ట్రిక్, వెహికల్స్ వందల సంఖ్యలో రోజుకో మోడల్ చొప్పిన వాహనదారులను అయోమయానికి గురి చేస్తున్నాయి. ఇలాంటి టైమ్‌లో రెగ్యులర్‌గా ఆఫీస్ కోసం వాడుకునే బైక్ కావాలంటే ఈ కింద ఇచ్చిన సమాచారాన్ని చూసి మీకు సరిగ్గా సూట్ అయ్యేదాన్ని సెలక్ట్ చేసుకోండి. భారతీయ యువతలో అత్యంత ప్రజాదరణ పొందిన 'పెర్ఫార్మెన్స్ మాక్సీ స్కూటర్'.దీని ఎక్స్–షోరూమ్ ధర సుమారుగా రూ.1.43 లక్షల నుండి రూ.1.46 లక్షల వరకు ఉంటుంది. సొగసైన ట్విన్–ాజుణ హెడ్‌లైట్లు, మస్కులర్ ఫ్రంట్ ఏప్రాన్‌తో దీని డిజైన్ దూకుడుగా, స్పోర్టీగా ఉంటుంది. ఆఫీసుకు వెళ్లేవారికి దీని పదునైన రూపం రోడ్లపై ఖచ్చితంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. యమహా ఏరోక్స్ 155 (ఘ్మెఖ్రు ాావతీశీఇ 155): ఇది ప్రస్తుతం భారతీయ యువతలో అత్యంత ప్రజాదరణ పొందిన 'పెర్ఫార్మెన్స్ మాక్సీ స్కూటర్'.దీని ఎక్స్–షోరూమ్ ధర సుమారుగా రూ.1.43 లక్షల నుండి రూ.1.46 లక్షల వరకు ఉంటుంది. సొగసైన ట్విన్–ాజుణ హెడ్‌లైట్లు, మస్కులర్ ఫ్రంట్ ఏప్రాన్‌తో దీని డిజైన్ దూకుడుగా, స్పోర్టీగా ఉంటుంది. ఆఫీసుకు వెళ్లేవారికి దీని పదునైన రూపం రోడ్లపై ఖచ్చితంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. బెర్గ్మాన్ స్ట్రీట్ 125: ఇది చాలా ఆచరణాత్మకమైన, సరసమైన మ్యాక్సీ–స్టైల్ స్కూటర్. దీని ధర రూ.1.02 లక్షల నుండి రూ.1.13 లక్షల మధ్య (ఎక్స్–షోరూమ్) ఉంటుంది. దీని డిజైన్ యూరోపియన్ మ్యాక్సీ స్కూటర్ల నుండి ప్రేరణ పొందింది. ఇందులో పెద్ద విండ్‌స్క్రీన్, వెడల్పాటి ఫ్రంట్ కౌల్ , పాదరక్షలకు సౌకర్యవంతమైన అమరిక ఉంటాయి. ఆఫీసు బ్యాగులు ఇతర అవసరమైన వస్తువుల కోసం సీటు కింద 24.6 లీటర్ల సామర్థ్యం గల పెద్ద స్టోరేజ్ సదుపాయం కల్పించబడింది. ఇది మెరుగైన పనితీరును అందించే 124ఛఛ సింగిల్–సిలిండర్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇది 8.58ూా పవర్, 10.2 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేయడం వల్ల నగర ట్రాఫిక్‌లో ప్రయాణం చాలా సులభం అవుతుంది. దీని ఉన్నత శ్రేణి వేరియంట్లలో ఇప్పుడు 4.2–అంగుళాల కలర్ ఔఖీ డిస్‌ప్లే, బ్లూటూత్ టర్న్–బై–టర్న్ నావిగేషన్, కీ–లెస్ ఇగ్నిషన్ వంటి ఆధునిక ఫీచర్లు ఉన్నాయి.ఈ స్కూటర్ లీటరుకు సుమారు 55 నుండి 59 కిలోమీటర్ల అద్భుతమైన మైలేజీని అందిస్తుంది.



# ప్రజలకు వైద్యం ఆర్థికబారం కాకూడదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,
### ఎమ్మెల్యే కూనంనేని సాంబాశివరావు

కుత్బుల్లాపూర్ జూన్ 28 (ప్రజాజ్వాల): పేద మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలంటే లక్షలు అప్పు చెయ్యాల్సివచ్చి ఆర్థికభారం పెరగడం వల్ల మరింత కడు పేదరికంలోకి నెట్టబడి వైద్యానికి దూరం అవుతున్నారని అలాంటి వారి కోసం ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలనే నినాదంతో నిరంతరం పోరాటం చేస్తుందని దాన్ని ప్రజలు కూడా స్వాగతిస్తున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబాశివరావు గారు నేడు సిపిఐ నాయకులు శ్రీనివాస్ చారీ గారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్ ను మరో శాసనసభ్యులు లక్ష్మారెడ్డితో కలిసి అందించారు.అదే విధంగా పేద,మధ్య తరగతి వర్గాల వారి వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిది కూడా ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వారికి పార్టీ అన్ని సమయలో సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ టి నర్సింహా,కార్యదర్శివర్గ సభ్యులు బోస్,జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,కార్యవర్గ సభ్యులు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టాప్ ఆర్డర్ అట్టర్ ఫ్లాప్.. పరుగు తేడాతో ఓడిన



155 పరుగుల తేడాతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు చివరి బంతి వరకు పోరాడింది. అయితే టాపార్డర్ అట్టర్ ఫ్లాప్ కావడంతో సులభంగా గెలిచే మ్యాచ్‌ను చేజార్చుకుంది. భారత క్రికెట్ అభిమానులకు ఆదివారం చేదు రోజుగా మిగలనుంది. మహిళల టి20 ప్రపంచకప్ 2026 నుంచి భారత జట్టు నిష్క్రమించగా.. ఐర్లాండ్ చేతిలో భారత పురుషుల జట్టు వరుసగా రెండో ఓటమిని చవి చూసింది. 155 పరుగుల తేడాతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు చివరి బంతి వరకు పోరాడింది. అయితే టాపార్డర్ అట్టర్ ఫ్లాప్ కావడంతో సులభంగా గెలిచే మ్యాచ్‌ను చేజార్చుకుంది. తిలక్ వర్మ (46 బంతుల్లో 55; 3 ఫోర్లు, 1 సిక్సర్) ఒంటరి పోరాటం చేశాడు. అయితే చివర్లో అవుటవ్వడం.. అప్పటికే బ్యాటర్లందరూ పెవిలియన్ చేరడంతో ఆఖరి బంతికి ఓడింది. కేవలం పరుగు తేడాతో ఓడి సిరీస్‌ను కోల్పోయింది. హర్షిత్ రాణా (10 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆడినట్లు కూడా టాపార్డర్ బ్యాటర్లు ఆడలేకపోయారు. ఐర్లాండ్ బౌలర్లలో జై ముంద్రా, మ్యాట్ హాలండ్ చెరో 3 వికెట్లు సాధించారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్.. టీమిండియా ముందు కఠినమైన లక్ష్యాన్నే ఉంచగలిగింది. 20 ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులు చేసింది. హ్యారీ టెక్టర్ (47 బంతుల్లో 53 ; 5 ఫోర్లు, 1 సిక్సర్) రాణించాడు. బెన్ (37) ఆకట్టుకున్నాడు. తొలి టి20తో పోలిస్తే ఈ స్కోరు తక్కువే అయినప్పటికీ పోరాడే లక్ష్యాన్ని భారత్ ముందు ఉంచింది. ఇక భారత బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లతో చెలరేగాడు. శివమ్ దూబే, అర్ష్ దీప్ సింగ్ తలా రెండేసి వికెట్లు సాధించారు. హర్షిత్ రాణా ఒక వికెట్ తీశాడు.

# మెస్సీ, రొనాల్డో కాదు.. డొనాల్డ్ ట్రంప్ దృష్టిలో ఫుట్‌బాల్ ఆల్‌టైమ్ గ్రేట్ ఇతడే!

ఇద్దరూ చరిత్ర సృష్టించేందుకు పోటీపడుతున్న తరుణంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా, ఈ 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు ట్రంప్ హాజరై, విజేతగా నిలిచిన జట్టుకు స్వయంగా ట్రోఫీని అందించనున్నారు. ఎవరనే చర్చ వచ్చినప్పుడల్లా లయనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డోల పేర్లే ఎక్కువగా వినిపిస్తాయి. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం వీరిద్దరి కంటే మరో ప్లేయర్‌ను ఆల్ టైమ్ గ్రేట్‌గా తేల్చి చెప్పారు. ప్రస్తుతం అమెరికా, మెక్సికో, కెనడా దేశాల వేదికగా 2026 ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. అర్జెంటీనాను వరుసగా రెండోసారి ప్రపంచ విజేతగా నిలపాలని మెస్సీ, తన సుదీర్ఘ కెరీర్‌లో ఒక్కసారైనా దక్కించుకోలేకపోయిన మెగా ట్రోఫీని పోర్చుగల్‌కు అందించాలని రొనాల్డో తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇద్దరూ చరిత్ర సృష్టించేందుకు పోటీపడుతున్న తరుణంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా, ఈ 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు ట్రంప్ హాజరై, విజేతగా నిలిచిన జట్టుకు స్వయంగా ట్రోఫీని అందించనున్నారు.

